నమస్తే తెలంగాణ
వికారాబాద్

8 | హైదరాబాద్, మంగళవారం 9 జనవరి 2024 | VIKARABAD

వేగవంతంగా దరఖాస్తుల నమోదు

పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 8 : ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను వేగవంతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో ప్రజాపాలన దరఖాస్తుల నమోదు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వానకాలం, యాసంగి సీజన్లపై మంత్రితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతీకుమారి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌లు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వానకాలం, యాసంగి 2022-23 ఏడాదికి సంబంధించి మిల్లర్లు మిల్లింగ్ కెపాసిటీ ప్రకారం లక్ష్యాలను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, జనవరి 8 : ఆరు గ్యారెంటీల పథకాలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి రాని అధికారులకు మెమో జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు సమావేశంలో లేవనెత్తిన అంశాలను పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. వచ్చే సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పంచాయతీ రాజ్ ఏఈ, విద్యుత్ శాఖ ఏఈపై ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సమావేశంలో ఎంపీపీ కరుణాఅజయ్‌ప్రసాద్ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శాంతబాయి, వైస్ ఎంపీపీ అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
– కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 8 : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 106 ఫిర్యాదులను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, డీఆర్‌డీవో కృష్ణన్‌తో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ఈ ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేసి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచొద్దని ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా తప్పులు దొర్లకుండా వేగవంతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. టీం లీడర్లు ప్రతి రోజూ రెండు షిఫ్టుల్లో పనిచేయాలన్నారు. ఉదయం, సాయంత్రం పది మంది చొప్పున 20 మంది కంప్యూటర్ ఆపరేటర్లతో రోజుకు వెయ్యి దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. నమోదు సమయంలో దరఖాస్తుదారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మొబైల్ నంబర్, ఎల్పీజీ గ్యాస్, పట్టాదారు పాసు బుక్కు నంబర్, ఉపాధి హామీ కూలీల జాబ్ కార్డు నంబర్లు తప్పులు దొర్లకుండా సరిగా నమోదు చేయాలని సూచించారు. డాటా ఎంట్రీ చేసిన దరఖాస్తులను సురక్షితంగా భద్రపరచాలన్నారు. దరఖాస్తుల్లో ఏమైనా అనుమానాలు ఉంటే దరఖాస్తుదారుకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ పనులకు సంబంధించి ప్రత్యేక అధికారులు పూర్తి బాధ్యతతో టీం లీడర్ల సహకారంతో పారదర్శకంగా శని వారం వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటర్, పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులకు ప్రత్యేక నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 11న నిర్వహించే జడ్పీ సర్వసభ్య సమావేశంలో అధికారులందరూ నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆహ్లాదగిరి

- అనంతగిరికి పర్యాటక సొబగులు
- అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు
- వారంలోగా కేంద్రానికి డీపీఆర్
- ఫిబ్రవరి చివరి వారంలో టెండర్ల ప్రక్రియ
- స్వదేశ్ దర్శన్‌లో భాగంగా ఎంపికైన అనంతగిరి
- 213 ఎకరాల్లో టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం
- రూ.118 కోట్లతో పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు
- రూ.85 కోట్లతో ఎకో టూరిజం అభివృద్ధి
- రూ.80 లక్షలతో అనంతపద్మనాభ ఆలయాభివృద్ధి
- 177 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్, హోటల్, వెల్‌నెస్ సెంటర్, రిసార్ట్, రోప్‌వే..
- మరో 36 ఎకరాల్లో పార్కింగ్, రోడ్లు, గ్రీనరీ, తాగునీరు తదితరాలు

వికారాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఊటీగా పిలిచే అనంతగిరి హిల్స్‌ను పర్యాటక ప్రదేశంగా కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇందుకు సంబంధించి ఎల్‌అండ్‌టీ సంస్థ రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో డీపీఆర్‌ను తయారు చేసే ప్రక్రియ తుది దశకు చేరుకున్నది. 213 ఎకరాల్లో టూరిజం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. వీటిలో 177 ఎకరాల్లో ఎకో టూరిజంతో పాటు కన్వెన్షన్ సెంటర్, హోటల్, రిసార్ట్, కాటేజెస్, ఆంఫి థియేటర్, పర్యాటకులను ఆకర్షించేందుకు అటవీ ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ వెల్‌నెస్ సెంటర్, శారీరక దృఢత్వానికి యోగా కేంద్రం, ధ్యాన కేంద్రం, స్పా, స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయనున్నారు.

వాచ్ టవర్లు.. ట్రెక్కింగ్..

అనంతగిరి అటవీ ప్రాంతంలోని వివిధ రకాల పక్షులను వీక్షించేందుకు వీలుగా వాచ్ టవర్ల నిర్మాణం, ట్రెక్కింగ్ ఏర్పాటుతో పాటు ఈ ప్రాంతాన్ని పూర్తిగా వీక్షించేందుకు రోప్‌వేను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మరో 36 ఎకరాల్లో పార్కింగ్ ఏరియాతోపాటు రోడ్లు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, గ్రీనరీని ఏర్పాటు చేయనున్నారు. అలాగే అనంతగిరి హిల్స్‌లోని అనంతపద్మనాభ స్వామి ఆలయం చుట్టూ సుందరీకరణతో పాటు పార్కింగ్ ఏరియా, లైటింగ్, ఫంక్షన్ హాల్ నిర్మాణం, వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయనున్నారు. అనంతగిరితోపాటు కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయనున్నారు. కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టుల్లో కాటేజీల తోపాటు రెస్టారెంట్లు, బోటింగ్, స్పీడ్ బోట్స్, వాటర్ స్పోర్ట్స్, ఆంఫి థియేటర్, రిసెప్షన్, ఆర్చ్‌లను ఏర్పాటు చేయనున్నారు. అనంతగిరి హిల్స్ తోపాటు కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టుల్లో టూరిజం అభివృద్ధికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రూ.118 కోట్లను ఖర్చు చేయనున్నాయి.

వారంలోగా కేంద్రానికి డీపీఆర్..

జిల్లాలో పర్యాటక ప్రాంతాలైన అనంతగిరి ప్రాంతాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. డీపీఆర్(డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్)ను ఇప్పటికే ఎల్‌ఎండ్‌టీ సంస్థ సిద్ధం చేయడంతో వారంలోగా కేంద్రానికి డీపీఆర్‌ను అందజేసేందుకు కసరత్తు చేస్తున్నారు. చిన్న, చిన్న మార్పులు చేయాలని కలెక్టర్ సూచించడంతో రెండు రోజుల్లో డీపీఆర్‌లో మార్పులు పూర్తి చేసి కేంద్రానికి అందజేసేలా చర్యలు చేపట్టారు. డీపీఆర్‌కు కేంద్రం ఆమోదం తెలిపిన అనంతరం టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది. 3,600 ఎకరాల్లో విస్తరించి ఉన్న అనంతగిరి అటవీ ప్రాంతంలోని 213 ఎకరాల్లో ఎకో టూరిజం స్పాట్‌గా అభివృద్ధిలోకి తీసుకురానున్నారు. హైదరాబాద్ నగరానికి సమీపంలో అనంతగిరి హిల్స్ ఉండడంతో వారాంతంలో అనంతగిరి హిల్స్‌లో పర్యాటకులు అధిక సంఖ్యలో సందడి చేస్తున్నారు. జిల్లాకు వచ్చే పర్యాటకుల తాకిడికి సరిపోను సౌకర్యాలు ఎక్కడా లేక పోవడంతో వారిని మరింత ఆకర్షించేలా ఈ ప్రాంతాన్ని ఎకో టూరిజం హబ్‌గా సరికొత్తగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన పనులను వేగవంతంగా చేస్తున్నారు. స్వదేశ్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా అనంతగిరి హిల్స్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఎంపిక చేశాయి. రెండేండ్లలోగా అనంతగిరి హిల్స్, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దనున్నారు.

పర్యాటకుల తాకిడి...

తెలంగాణ ఊటీగా పిలిచే అనంతగిరి హిల్స్‌కు పర్యాటకుల తాకిడి రోజురోజుకు పెరుగుతున్నది. రాష్ట్ర రాజధానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో సెలవులు వస్తే చాలు నగరవాసులు అనంతగిరిలో వాలిపోతున్నారు. ప్రతీ శుక్ర, శని, ఆదివారాల్లో 4వేల నుంచి 5వేల మంది వరకు పర్యాటకులు ఇక్కడికి వస్తున్నారు. దీంతో వారాంతపు సెలవుల్లో అనంతగిరి పర్యాటకులతో కిటకిటలాడుతున్నది. అనంతగిరిలోని ప్రసిద్ధ పద్మనాభస్వామిని దర్శించుకోవడంతోపాటు అటవీ ప్రాంతంలోని వ్యూ పాయింట్లను చూసేందుకు, ట్రెక్కింగ్ చేసేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. కేరెళ్లి వెళ్లే దారిలో నంది విగ్రహం, ఎత్తైన అటవీ ప్రాంతంలో నుంచి వచ్చే వాటర్ పాల్స్ వద్ద పర్యాటకులు సేద తీరుతున్నారు.

అనంతగిరికా హవా.. లాకో రోగోంకా ధవా..

అనంతగిరి అడవుల్లోని వాతావరణంలో సేద తీరేందుకు చాలా మంది పర్యాటకులు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తుంటారు. అనంతగిరికా హవా.. లాకో రోగోంకా ధవా (అనంతగిరి గాలి లక్ష రోగాలకు మందు) అని నానుడి ఉన్నది. అనంతగిరి అటవీ ప్రాంతాల్లోని ఔషధ మొక్కలతో రోగాలు నయమవుతుంటాయన్న నమ్మకంతో చాలా మంది పర్యాటకులు అనంతగిరి కొండకు క్యూ కడుతున్నారు.

మరోవైపు అనంతగిరి అడవుల్లో జింకలతోపాటు వందల రకాల పక్షులు, నిశాచర జంతువులతోపాటు వివిధ రకాల సీతాకోక చిలుకలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.

ఫిబ్రవరి చివరి వారంలో టెండర్లు..

అనంతగిరి ఎకో టూరిజం అభివృద్ధి పనులకు సంబంధించి ఫిబ్రవరి చివరి వారంలోగా టెండర్ల ప్రక్రియ ప్రారంభం అవుతున్నది. ఇప్పటికే మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. డీపీఆర్‌ను దాదాపు పూర్తి చేశాం. వారం రోజుల్లోగా కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్‌ను అందజేసేందుకు కసరత్తు చేస్తున్నాం. అనంతపద్మనాభ ఆలయాభివృద్ధి, సర్పన్‌పల్లి, కోట్‌పల్లి ప్రాజెక్టులు పర్యాటకంగా అభివృద్ధిలోకి రానున్నాయి.

– సి.నారాయణ రెడ్డి, కలెక్టర్, వికారాబాద్ జిల్లా

కొడంగల్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

'కడా' కార్యాలయం ప్రారంభం

'కడా' కార్యాలయాన్ని ప్రారంభించి పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కొడంగల్, జనవరి 8: కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిని సారించి 'కడా'ను ఏర్పాటు చేశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని 'కడా' కార్యాలయంగా మార్చి అధికారులు పూజలు చేశారు. జిల్లా అదనపు కలెక్టర రాహుల్‌శర్మ, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సున్నపురాయి ఎక్కువగా ఉన్నందున సిమెంటు ఫ్యాక్టరీ, కాగ్నా నదినీటి సద్వినియోగం వంటి తదితర అంశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి అశకాశాలు కల్పించే దిశగా వృత్తివైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సీఎం ప్రత్యేక కార్యదర్శి రాణికుమిదిని, కలెక్టర్ రెండు రోజుల క్రితం కొడంగల్, బొంరాస్‌పేట ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాలలకు స్థలాలు కేటాయించి భవన నిర్మాణాలను చేపట్టనున్నట్లు తెలిపారు. కొడంగల్ పట్టణంలోని సీహెచ్‌సీ 50 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా రూపొందించనున్నట్లు సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి తెలిపారు. సోమవారం ప్రభుత్వ దవాఖానను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ, డాక్టర్లు సాకేత్, శావణి, వీణ ఉన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు, జనవరి 8 : ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని కేరెళ్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం కొండాపూర్ ఖుర్దులో నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ధారూరు మండలంతో పాటు వికారాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా తాగు, సాగునీటిని తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ సునీతా రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ నర్సింహారెడ్డి, విశ్రాంతి శాస్త్రవేత్త పెంటారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో చెన్నారెడ్డి, తహసీల్దార్ భువనేశ్వర్, ఎంపీవో షఫీఉల్లా, ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ రాములు పాల్గొన్నారు.

బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్న స్పీకర్..

వికారాబాద్ : మండలంలోని పులుమద్ది గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప దేవాలయంలో సోమవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు.

కొండాపూర్ ఖుర్దులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న శాసన సభాపతి ప్రసాద్‌కుమార్

స్పీకర్‌ను కలిసిన ట్రస్మా నాయకులు

రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం(ట్రస్మా) నాయకులు సోమవారం ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నాగయ్య, జిల్లా అధ్యక్షుడు ఎం లూయిస్, జిల్లా అధ్యక్షుడు ఎన్ వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు సి. చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బసవరాజు, పాఠశాలల కరస్పాండెంట్స్ తిరుమలయ్య ఉన్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు తంటాలు

ఆధార్ అప్‌డేట్‌కు క్యూ కట్టిన ప్రజలు

తాండూరు, జనవరి 8: ప్రజాపాలన దరఖాస్తుల నేపథ్యంలో ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకునేందుకు ప్రజలు సోమవారం తాండూరు పోస్ట్ ఆఫీస్ ముందు బారులు తీరారు. వందలాది మంది ప్రజలు ఒకే సారి రావడంతో గందరగోళంగా మారింది. ముఖ్యంగా రేషన్ కార్డు దరఖాస్తు కోసం ఈకేవైసీ తప్పనిసరి కావడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సందర్భంగా తాండూరు సబ్ డివిజన్ పోస్ట్‌ఆఫీస్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు అందోళన చెందరాదని సూచించారు. రోజుకు 50 మందికి టోకెన్లు ఇచ్చి ఆధార్ అప్‌డేట్ చేయనున్నట్లు తెలిపారు. చిన్నారుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కులకచర్ల, జనవరి 8 : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. వారిలో రేణుక, ప్రియాంక, అంజలి ఎంపికైనట్లు కేజీబీవీ పాఠశాల ఎస్‌వో దేవి తెలిపారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి చేయాలి

కులకచర్ల, జనవరి 8 : ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులు ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కులకచర్ల మండల ప్రత్యేక అధికారి సరళకుమారి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి..

మోమిన్‌పేట, జనవరి 8: ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని జిల్లా అధికారి చరితా రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తుల నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

వికారాబాద్, జనవరి 8 : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం వికారాబాద్ రైల్వే స్టేషన్ ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

ఊరు వాడ సల్లంగా సూడు 'మైసమ్మ తల్లి'

పెద్దేముల్, జనవరి 8 : మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో సోమవారం గ్రామ దేవత ఊరడమ్మ ఉత్సవాల్లో భాగంగా మైసమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు తీశారు. మైసమ్మ తల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ బోనాలను, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

'కడా' ప్రత్యేకాధికారిని కలిసిన తహసీల్దార్లు

బొంరాస్‌పేట, జనవరి 8 : కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని బొంరాస్‌పేట, దుద్యాల తహసీల్దార్లు వెంకటేశ్, దానయ్య సోమవారం కొడంగల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిశారు. వెంకట్‌రెడ్డికి వారు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తులు తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలి

వికారాబాద్, జనవరి 8 : గ్యారెంటీల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా ఎంట్రీ చేయాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల మున్సిపల్ అధికారులకు సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ప్రక్రియను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

జిల్లాల పునర్‌వ్యవస్థీకరణపై కమిషన్

పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జనవరి 8 : జిల్లాల పునర్‌వ్యవస్థీకరణపై సిట్టింగ్ లేదా రిటైర్డ్ జడ్జితో ప్రత్యేక కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర సర్కార్ యోచిస్తున్నదన్నారు. సోమవారం ఎంపీపీ అరవింద రావు అధ్యక్షతన జరిగిన పరిగి మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గతంలో అధ్యయనం లేకుండా, శాస్త్రీయ పద్ధతిలో కాకుండా జిల్లాలు ఏర్పాటు చేశారని తెలిపారు. చిన్న జిల్లాలతో పరిగి ప్రాంతానికి నష్టం జరిగిందన్నారు. వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ ఫైల్ శరవేగంగా కదులుతున్నదన్నారు. రైల్వేలైన్ నిర్మాణానికి గతంలో రూ.800కోట్లు అంచనా వ్యయం ఉండగా, ప్రస్తుతం రూ.2100కోట్లకు పెరిగిందన్నారు. పూడూరులో రూ.2500కోట్లతో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు కానున్నదని, తద్వారా నావల్ స్కూల్ సైతం ఏర్పాటవుతున్నదని తెలిపారు. జడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీవో శేషగిరిశర్మ, సర్పంచ్‌లు వెంకటయ్య, జగన్, నర్సింహ పాల్గొన్నారు.

డైట్ ప్రథమ సంవత్సరం బ్యాచ్ ప్రారంభం

వికారాబాద్, జనవరి 8 : చాలా కాలం నుంచి ఎదురు చూసిన డైట్ కోర్సు 2023-25 మొదటి సంవత్సరం బ్యాచ్‌ను ప్రారంభించినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమంగా రెండు సంవత్సరాల కోర్సును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కోర్సు శిక్షణ పొందిన వారికి 8వ తరగతి వరకు చెప్పే అర్హత ఉంటుందని తెలిపారు. గెస్ట్ లెక్చరర్ బందెప్పగౌడ్ పాల్గొన్నారు.

ముగిసిన ఇస్తేమా

- ఆహారపదార్థాలు అందజేసిన ఎంపీ రంజిత్‌రెడ్డి
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్

పరిగి, జనవరి 8 : పరిగి మున్సిపాలిటీ పరిధిలోని న్యామత్‌నగర్‌లో మూడు రోజులపాటు కొనసాగిన ఇస్తేమా సోమవారం మధ్యాహ్నం ముగిసింది. ఈనెల 6వ తేదీ శనివారం ఉదయం నుంచి ప్రారంభమైన ఇస్తేమా మూడు రోజులపాటు నిర్వహించారు. ఇస్తేమాకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల తోపాటు కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. చివరి రోజు సుమారు నాలుగు లక్షలకు పైగానే హాజరైనట్లు అంచనా. మూడు రోజులపాటు పలువురి ప్రసంగాలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఢిల్లీ నిజాముద్దీన్ మర్కజ్ ముఖ్య ప్రతినిధి మౌలానా ఫారూఖ్, నిజాముద్దీన్ మర్కజ్ ముఖ్య ప్రతినిధులు మౌలానా జెన్‌షాద్ సాబ్, బాయి మూర్సావలిన్, తెలంగాణ, ఏపీ ఇన్‌చార్జీ మౌలానా అబ్దుల్ సమద్ పాల్గొన్నారు. సోమవారం మధ్యాహ్నం చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి ఇస్తేమాకు హాజరైన వారికి వాటర్‌బాటిల్స్, ఆహారపదార్థాలు అందజేశారు. ఇస్తేమాను పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి సందర్శించారు. ఇస్తేమాకు హాజరైన వారికి కల్పించిన సదుపాయాలపై వారు అడిగి తెలుసుకున్నారు.

ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు